RNI NO. APTELL/ 2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ సంపుటి : 20 సంచిక : 274 గురువారం 20 ఆగష్టు 2026 పబ్లిషర్ : కొక్కు రవికుమార్ krk7018@gmail.com పేజీలు :4 రూ॥ 1/-

## రూ.2,229 కోట్లతో ఏపీ-తమిళనాడు మధ్య రైల్వే లైన్ల విస్తరణ..!

ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల మధ్య రవాణా సదుపాయాలను మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ దేశవ్యాప్తంగా పలు మల్టీ-ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా ఏపీ -- తమిళనాడును కలిపే గుమ్మడిపూడి -- గూడూరు సెక్షన్‌లో మూడో, నాలుగో రైల్వే లైన్ల నిర్మాణానికి రూ. 2,229 కోట్లను కేటాయించినట్లు కేంద్ర మంత్రులు వెల్లడించారు.

## ఐటీ ఉద్యోగులకు TGSRTC గుడ్‌న్యూస్... ప్రగతినగర్--వేవ్‌రాక్ మధ్య కొత్త ఏసీ బస్సులు

హైదరాబాద్ నగరంలో ప్రజా రవాణాను మరింత సౌకర్యవంతంగా మార్చే దిశగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మరో కొత్త ఏసీ ఎలక్ట్రిక్ బస్ సర్వీసును అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రగతినగర్ కమాన్ నుంచి వేవ్‌రాక్ వరకు ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా ఈ సర్వీస్ నడవనుంది. ముఖ్యంగా నగరంలోని నార్త్ ఈస్ట్ ప్రాంతాల నుంచి ఐటీ కారిడార్‌లోని వేవ్‌రాక్ వైపు ప్రతిరోజూ రాకపోకలు సాగించే ఐటీ ఉద్యోగులు, ఇతర ప్రయాణికులకు ఈ సర్వీస్ ఉపయోగపడనుంది.




# పామాయిల్, గంజి, పిండితో కల్తీ నెయ్యి తయారీ.. హోటళ్లు, స్వీట్ షాపులకు సరఫరా..!

## ముఠాను పట్టుకున్న పోలీసులు

హైదరాబాద్ శివార్లలో నకిలీ నెయ్యి తయారీ చేస్తున్న ముఠాను హెచ్-ఫాస్ట్ పోలీసులు పట్టుకున్నారు. కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి తదితర ప్రాంతాల్లో 39 తయారీ కేంద్రాలు, 91 రిటైల్ దుకాణాలపై అధికారులు దాడులు నిర్వహించారు. సుమారు 25.5 టన్నుల నకిలీ నెయ్యితో పాటు 10 టన్నుల ముడిసరుకును స్వాధీనం చేసుకున్నారు. పామాయిల్, మిల్క్ పౌడర్, గంజి, పిండి, రవ్వ, సింథటిక్ రంగులు, ఫ్లేవర్లతో నెయ్యిని తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కల్తీ నెయ్యిని నగరంలోని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, స్వీట్ షాపులు, ఆయుర్వేద దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. 2లో

# కబ్జాలో రూ.400 కోట్ల ప్రభుత్వ స్థలం



## మధిర పట్టణంలోని డొంక రహదారిలో నిర్మాణాలు స్థలాలను కాపాడాలంటున్న స్థానికులు

ఖమ్మం జిల్లా మధిర పట్టణంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎస్సీ కాలనీ నుంచి దెందుకూరు వరకు సుమారు 5 కిలోమీటర్ల మేర ఉన్న డొంక రహదారి ఆక్రమణలకు గురవుతోందని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి వాణిజ్య భవనాలు, వెంచర్లు నిర్మిస్తున్నారని ఈ డొంక భూమి విలువ రూ.400 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. అధికారులు సర్వే చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక తెలంగాణ ఆవిర్భావం తర్వాత భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. మారుమూల పల్లెల్లోనూ భూముల ధరలు లక్షలు పలుకుతున్నాయి. ఇదే అదనుగా కొందరు అక్రమార్కులు కబ్జాలకు పాల్పడుతున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కన్నేసి సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఖమ్మం జిల్లా మధిర పట్టణంలోనూ భూముల ధరలు పెరుగుతుండటంతో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవతున్నాయి. పెరుగుతున్న వాణిజ్య కార్యకలాపాలు, రియల్ ఎస్టేట్ డిమాండ్‌తో భూముల ధరలు భారీగా పెరగటంతో పట్టణ పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలపై కొందరు ఆక్రమణదారులు కన్నేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూములకు ఆనుకుని ఉన్న కొద్దిపాటి ప్రైవేట్ స్థలాలను తొలుత కొనుగోలు చేసి.. క్రమంగా పక్కనే ఉన్న ప్రభుత్వ భూముల్లోకి చొచ్చుకెళ్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో మధిర పట్టణానికి దశాబ్దాలుగా ఉన్న పురాతన డొంక రహదారి క్రమంగా ఆక్రమణలకు గురవుతోంది. ఒకప్పుడు ప్రజల రాకపోకలకు, వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడిన ఈ మార్గం భవిష్యత్తులో పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. మధిరలోని ఎస్సీ కాలనీ నుంచి దెందుకూరు వరకు సుమారు 5 కిలోమీటర్ల పొడవున డొంక రహదారి ఉంది. మధిర- -విజయవాడ ప్రధాన రహదారి సమీపం నుంచి కొనసాగుతున్న ఈ మార్గం దాదాపు శతాబ్ద కాలంగా ప్రజల వినియోగంలో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో భూముల ధరలు భారీగా పెరగడంతో ఈ ప్రభుత్వ భూమికి విలువ కూడా పెరిగింది. ఎస్సీ కాలనీ నుంచి మార్కెట్‌యార్డు వరకు గజం ధర సుమారు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు పలుకుతున్నట్లు స్థానిక రియల్ ఎస్టేట్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో డొంకకు ఆనుకుని ప్రైవేట్ స్థలాలను కొనుగోలు చేసిన కొందరు క్రమంగా ప్రభుత్వ భూమిలోకి చొచ్చుకెళ్తున్నారు. దీంతో ఒకప్పుడు 100 అడుగుల వెడల్పుతో ఉన్న ఈ పురాతన మార్గం ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో కేవలం 20 అడుగులకు మాత్రమే పరిమితమైనట్లు స్థానికులు చెబుతున్నారు. సుమారు 5 కిలోమీటర్ల మేర విస్తరించిన ఈ డొంక ప్రభుత్వ భూమి విలువ ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం రూ.400 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, సర్వే నిర్వహించి, డొంకకు సంబంధించిన హద్దులను స్పష్టంగా గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు పాత రహదారుల కాపాడటం కూడా అవసరమని ప్రజలు అంటున్నారు.

## అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా చొరబాటుపై కేంద్రం స్పందన



అరుణాచల్ ప్రదేశ్‌లోకి చైనా ఆర్మీ 60 కిలోమీటర్ల మేర చొచ్చుకొచ్చిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడతూ తప్పుడు వార్తలను తీవ్రంగా ఖండించారు. కొంతమంది పనిగట్టుకుని బంగ్లాదేశ్ మరియు ఇతర ప్రాంతాలకు చెందిన పాత, సంబంధం లేని వీడియోలను షేర్ చేస్తూ భారత భూభాగంలోకి చైనా సైన్యం చొరబడిందంటూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇలాంటి నిరాధారమైన వదంతులు దేశంలో గందరగోళాన్ని సృష్టించడంతో పాటు సరిహద్దుల్లో కాపలా కాస్తున్న మన ఆర్మీ సైనికుల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా ఉంటాయని హెచ్చరించారు.



## ఇంచార్జ్ మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్.

నిజామాబాద్ సిటీ , ఆగస్టు 19 ( ప్రజాగళం) నిజామాబాద్ నగర పర్యటనకు విచ్చేసిన జిల్లా ఇంచార్జి మంత్రి డి.అనసూయ సీతక్కను కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రితో పాటు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీలకు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. వారితో కొద్దిసేపు భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

## కల్వకుంట్ల కవితతో తమిళనాడు సీఎం విజయ్ జ్యోతిష్యుడు రాధన్ భేటీ..

కవిత, తమిళనాడు సీఎం జ్యోతిష్యుడి భేటీ
హైదరాబాద్‌లో కవితను కలిసిన రాధాన పండిట్
సోషల్ మీడియాలో ఫోటో బాగా వైరల్ అవుతోంది
తమిళనాడు సీఎం జ్యోతిష్యుడ్ని కలిసిన కవిత 2లో



## తెలంగాణ ప్రగతికి బ్యాంకులే కీలకం : డిప్యూటీ సీఎం భట్టి

తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్థికంగా మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే మహత్తర లక్ష్యాన్ని సాధించడంలో బ్యాంకింగ్ రంగం క్రియాశీలక భాగస్వామ్యం కావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన 50వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఆర్థిక వృద్ధి లక్ష్యాలు.. కేవలం ప్రభుత్వ వ్యయం ద్వారానే అనుకున్న అభివృద్ధి సాధ్యం కాదని, బలమైన ఆర్థిక సంస్థలు, పెద్ద ఎత్తున ప్రైవేట్ పెట్టుబడులు మరియు వినూత్న రుణ విధానాలు అవసరమని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం...
ప్రజాగళం
తెలుగు దినపత్రిక
గురువారం
20-08-2026

## సంపాదకీయం

# నానాటికీ తీసికట్టుగా రాష్ట్ర విద్యావ్యవస్థ

భారత రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూలు ప్రకారం రాష్ట్రాల జాబితాలో ఉన్నటువంటి 'విద్య' అన్న అంశం, 42వ రాజ్యాంగ సవరణ(1976) ద్వారా ఉమ్మడి జాబితా లోనికి చేరింది. దీని వల్ల కేంద్రం విద్యపై విశేష అధికారాలను సంపాదించింది. ఫెడరల్ రాజ్యాంగ స్ఫూర్తికి ఈ విధమైన చర్య విఘాతమైనప్పటికీ చాలా రాష్ట్రాలు దీనిని పెద్దగా వ్యతిరేకించలేదు. దీనికి ఒక ముఖ్య కారణం రాష్ట్రాలు కేంద్రం నుంచి మరిన్ని నిధులు వస్తాయని భావించాయి. విద్యను ప్రజోపయోగకర వస్తువు (పబ్లిక్ గూడ్) భావన నుండి ప్రైవేటు రంగానికి దాఖలు చేయాలనే ఆలోచన కూడా కొన్ని చోట్ల వుంది. కేంద్రం ఇదే అదనుగా విద్యా సంస్థలు, ముఖ్యంగా ఉన్నత విద్యారంగంపై పూర్తి నియంత్రణను సాధించే ప్రయత్నం చేస్తున్నది. ఇప్పటికే ఉన్నత విద్యా సంస్థల స్థాపన, కోర్సుల ప్రారంభం, పాఠ్య ప్రణాళిక నిర్ధారణ, ప్రమాణాల మదింపు వంటి విషయాలు పూర్తిగా కేంద్ర ప్రభుత్వ సంస్థల అజమాయిషీలో కొనసాగుతున్నాయి. రాష్ట్రాలది కేవలం ప్రేక్ష?క పాత్రే. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు 'పిపిపి' పేరున ప్రైవేటు భాగస్వామ్యాన్ని ఆహ్వానిస్తూ, సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు కనపడుతున్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విషయంగా పరిస్థితిని విశ్లేషిస్తే ఒక దశాబ్దం క్రితం, అనగా 2014-15 విద్యా సంవత్సరంలో 58,950 పాఠశాలలు ఉండగా, వాటిలో 44,617 ప్రభుత్వ రంగంలో ఉన్నాయి. ఇది సుమారుగా 75.7 శాతం. ఈ సంఖ్య 2025-26 నాటికి 60,843 గా నమోదైంది. ఈ మొత్తంలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 44,222 గా ఉన్నది (72.7 శాతం). ఈ గణాంకాల ఆధారంగా ప్రభుత్వ-ప్రైవేటు యాజమాన్యంలో నడిచే పాఠశాలల నిష్పత్తి 70:30 అని చెప్పవచ్చు. విద్యార్థుల సంఖ్యాపరంగా గమనిస్తే, ఈ నిష్పత్తి 60:40 గా ఉంటుంది. దీనికి కారణం, ఏకోపాధ్యాయ పాఠశాలలు, తరగతులు మితంగా ఉండేవి, ప్రవేశాల సంఖ్య, డ్రాపవుట్ల శాతం, ఇవన్నీ కలిపితే ప్రభుత్వ రంగంలో నడిచే పాఠశాలల ప్రభావం ఎంతమేరకు అన్నది మనకు అవగతమవుతుంది. అసలు ఏమాత్రం ఆర్థిక వనరులు లేని కుటుంబాలు మినహా, ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపేవారి సంఖ్య నానాటికీ గణనీయంగా తగ్గిపోతున్నది. దీనికి తోడు క్రమబద్ధీకరణ (రేషనలైజేషన్) పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పాఠశాలల ఏకీకృత విధానం ప్రభుత్వ విద్యాసంస్థలను మరింతగా దిగజార్చుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం విద్యపై చేస్తున్న వ్యయం రాను రాను గణనీయంగా పడిపోతున్నది. ఉదాహరణకు 2015-16లో మొత్తం బడ్జెట్ లో విద్యకు 16.44 శాతం కేటాయించగా, అది 2020-21 నాటికి 11.21 శాతానికి పడిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరమైన 2026-27లో కూడా విద్యకు కేటాయింపు 11.7 శాతమే ఉన్నది. మొత్తం రూపాయలలో కేటాయింపులు సుమారుగా రూ.14,000 కోట్ల నుండి ప్రస్తుతం రూ.35,000 కోట్లకు పెరిగినా, మొత్తం బడ్జెట్ ప్రతిపాదనలలో విద్య శాతం 2020-21 నాటి స్థితిలోనే ఉన్నది. ఈ అరకొర కేటాయింపుల ప్రభావంతో పాఠశాల విద్యాభివృద్ధి సూచిక (ఎస్.ఇ.డి.ఐ-సెడి)లో ఆంధ్రప్రదేశ్ 2025-26 గణాంకాల ప్రకారం 15వ స్థానంలో ఉన్నది. ఈ సూచికలో అగ్రభాగాన ఉన్న చండీగఢ్ సంయుక్త (కాంపొజిట్) సూచీ 0.826 గా ఉండగా ఆంధ్రప్రదేశ్ సూచీ 0.593 గా ఉన్నది. దక్ష?ణాది రాష్ట్రాలైనటువంటి కేరళ(0.798), తమిళనాడు (0.706), మహారాష్ట్ర, (0.645) లతో కూడ పోటీ పడలేకపోతున్నది. ఈ పరిస్థితిని నిశితంగా గమనించాలి. ఇక ఇంటర్ మీడియట్ విద్య విషయాన్ని పరిశీలిస్తే, రాష్ట్రంలో దరిదాపు 3000 వరకు జూనియర్ కళాశాలలు ఉండగా అందులో 2500 వరకు ప్రైవేటు సంస్థలే. ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా ప్రారంభించిన 53 కళాశాలలతో కలిపి మొత్తం ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 471 మాత్రమే. విద్యార్థుల సంఖ్యాపరంగా చూస్తే, రాష్ట్రంలో మొత్తం జూనియర్ కళాశాలల్లో సుమారుగా 12 లక్ష?ల మంది విద్యార్థులు ఉండగా, కేవలం 1.5 లక్ష?ల మంది మాత్రమే ప్రభుత్వ కళాశాలలో చదువుతున్నారు. అంటే దాదాపు 90 శాతం ఇంటర్మీడియట్ విద్య ప్రైవేటు వ్యక్తుల చేతులలోనే ఉన్నది. ఉన్నత విద్యకు సంబంధించి, విశ్వవిద్యాలయాలు, కళాశాలల విషయాన్ని పరిశీలిస్తే, రాష్ట్రంలో 28 విశ్వవిద్యాలయాలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో, 7 డీమ్డ్, 13 ప్రైవేటు సంస్థలుగా కొనసాగుతున్నాయి. అలాగే రాష్ట్రంలో సుమారుగా 2500 కళాశాలలు వివిధ విశ్వవిద్యాలయాలకు అనుబంధంగా వున్నాయి. వీటన్నింటిలో 15 లక్ష?ల మంది చదువుతున్నారు. వీరిలో 3.5 లక్ష?ల మంది విశ్వవిద్యాలయాలలో, ఎక్కువ భాగం పి.జి కోర్సులలో చేరి ఉన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు నిష్పత్తులను గమనిస్తే, విశ్వవిద్యాలయాల స్థాయిలో సుమారుగా 50 శాతం, కళాశాలల విషయంగా 85 శాతం ప్రైవేటు సంస్థలలోనే విద్యార్థులు చేరి ఉన్నట్లుగా మనకు తెలుస్తుంది. గణనీయమైన ఈ మార్పులన్నీ గత నాలుగైదు సంవత్సరాల కాలంలో ఏర్పడినవే. ప్రత్యేకించి విశ్వవిద్యాలయాలకు నిధుల అందజేత పూర్తిగా తగ్గిపోయింది. 2026-27 బడ్జెట్ లో విద్యకు రూ. 34,875 కోట్లు కేటాయించగా, అందులో రూ.32,308 కోట్లు పాఠశాల విద్యకు, కేవలం రూ.2,567 కోట్లు ఉన్నత విద్యకు కేటాచించబడినాయి. విశ్వవిద్యాలయాలకు మంజూరు చేసింది కేవలం రూ.1232 కోట్లు మాత్రమే. దీనిని రాష్ట్ర ప్రభుత్వ అజమాయిషీ లోని 28 విశ్వవిద్యాలయాలు పంచుకోవాలి. మరీ విచారకరమైన అంశం ఏమనగా, రాష్ట్రంలోని ఐదు విశ్వవిద్యాలయాలకు 2026-27లో కేటాయింపులు సంవత్సరం మొత్తానికి ఒక్కొక్క దానికి రూ.10 కోట్ల లోపే. అందునా ఒంగోలులోని ఆంధ్ర కేసరి ప్రకాశం విశ్వవిద్యాలయానికి కేటాయించింది కేవలం రూ.1.05 కోట్లు. అలాగే వై.ఎస్.ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి దక్కింది రూ.2.56 కోట్లు, ఉర్దూ యూనివర్సిటీకి మంజూరైనవి రూ.3.13 కోట్లు. ఈ నిధులతో ఉన్నత ప్రమాణాలు ఏ విధంగా సాధించగలవో అర్థం కాదు. ఇంకొక విచిత్రమైన అంశం ఏమంటే యు.జి, పి.జి స్థాయి కోర్సుల ప్రవేశాలను కూడా ప్రభుత్వ శాఖలు నియంత్రించడం. ఇంతకు మునుపు ప్రతి విశ్వవిద్యాలయం తాను అందిస్తున్న, అనుబంధ కళాశాల కోర్సులకు మొత్తంగా తానే నోటిఫికేషన్ ఇచ్చి, విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అంటే జులై నాటికే ప్రవేశాలు పూర్తి చేసేది. నేడు ఏకీకృత విధానం ద్వారా డిగ్రీ కోర్సుల ప్రవేశాలను కూడా తామే క్రమబద్ధీకరించడం ద్వారా విపరీతమైన ఆలస్యం చోటు చేసుకొంటున్నది. గతిలేక విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రైవేటు, డీమ్డ్ విశ్వ విద్యాలయాలను వెతుక్కొనే పరిస్థితిని కల్పిస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా బదిలీ అయ్యే నిధులను తగ్గించుకొనే ప్రక్రియలో భాగంగా, విద్యా వ్యవస్థనే నిర్వీర్యం చేయబూనడం విచారకరం. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆగస్టు 15 దాటిన తరువాత కూడా ప్రవేశాలు మొదలు కాలేదంటే విద్యా సంవత్సరాన్ని ఏ విధంగా క్రమబద్ధీకరించగలుగుతాం? ప్రైవేటు విద్యా సంస్థలలో ప్రవేశాలు ముగిసి, తరగతులు మొదలైనాయి. పిల్లల భవిష్యత్తుపై ఆశలు పెంచుకొన్న ఏ తల్లిదండ్రులు ఇంతకాలం వేచి ఉండగలరు? ప్రత్యేకించి వ్యవస్థా ప్రక్రియలలో మార్పుల కారణంగా ఉన్నత విద్యా కమిషనరేట్ స్థాయిని పెంచి, అధికారాలను దఖలు పరిచి, ఉన్నత విద్యా మండలిని నిర్వీర్యం చేయడం, రాష్ట్రంలోని ఉన్నత విద్యా నిర్వహణను మరింత కుంటుపరుస్తుంది. కాబట్టి మన రాష్ట్ర విద్యా వ్యవస్థను, దాని నాణ్యతను మెరుగుపరచడం కోసం పూర్తిగా సంస్కరించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. తక్ష?ణ చర్యగా ప్రవేశాల పెంపు, ఫీజు రీయింబర్స్‌మెంట్, బడ్జెట్ నిధుల కేటాయింపులపై దృష్టి సారించాలి.

# క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో ప్లేస్ మెంట్ డ్రైవ్ లో 51 మంది విద్యార్థుల ఎంపిక..



ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా ఆగస్ట్ 19 :ఆర్మూర్ మండలంలోని చేపూర్ లోని క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో తెలంగాణ అకాడమీ పర్ స్కిల్ అండ్ నాలెడ్జ్( టీఏఎస్ కె) ఆధ్వర్యంలో ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ ప్లేస్మెంట్ డ్రైవ్ కు బిటెక్ ఎంబీఏ చివరి సంవత్సరం విద్యార్థులతో పాటు 2026 లో పట్టుభద్రులైన విద్యార్థులు కలిపి 125 మందికి పైగా హాజరయ్యారు వివిధ ఉద్యోగ విభాగాలకు నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో మొత్తం 51 మంది విద్యార్థులు ఎంపికయ్యారు ఈ ప్లేస్ మెంట్ డ్రైవ్ ను ప్లేస్ మెయిన్ హెచ్ ఆర్ సొల్యూషన్ సంస్థ నిర్వహించింది. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి కరస్పాండెంట్ శ్రీ అల్జాపూర్ దేవేందర్ గారు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు ఉద్యోగ అవకాశాలను కల్పించడం కళాశాల ప్రధాన లక్ష్యాలలో ఒకటని ఆయన తెలిపారు ప్రస్తుతం పోటీ ప్రపంచంలో కేవలం విద్యార్హతలు మాత్రమే కాకుండా సమాచార మార్పిడి నైపుణ్యాలు సాంకేతిక పరిజ్ఞానం విశ్లేషణాత్మక ఆలోచన విధానం ప్రయోగిగా పరిజ్ఞానం వంటి నైపుణ్యాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు విద్యార్థులు చదువుకునే దశలోనే పరిశ్రమల అవసరాలకు అనుకూలంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కళాశాలలో విద్యార్థులకు మెరుగైన కెరీర్ అవకాశాలు కల్పించేందుకు నిరంతరం ప్రముఖ సంస్థలతో కలిసి ఉద్యోగ ఎంపిక కార్యక్రమాలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు విద్యార్థులు అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్లేస్ మెంట్ డ్రైవ్ లో 51 మంది విద్యార్థులు ఎంపిక కావడం కళాశాలకు విద్యార్థులకు గర్వకారణం అని అన్నారు ఎంపికైన ప్రతి విద్యార్థికి అభినందలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని ప్రముఖ సంస్థలను కళాశాలకు తీసుకువచ్చి విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు .

కళాశాల ప్రిన్సిపల్ డా. కే శ్రీనివాస్ గారు మాట్లాడుతూ విద్యార్థుల కెరీర్ అభివృద్ధిలో ఉద్యోగ ఎంపిక కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు విద్యార్థులు తమ విద్యను ఉద్యోగ అవకాశాలతో అనుసంధానం చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు సంస్థలు కోరుకునే నైపుణ్యాలను విద్యార్థులు ముందుగానే అభివృద్ధి చేసుకుంటే ఉద్యోగ సాధన మరింత సులభతరం అవుతుందని తెలిపారు. క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో సమాచార మార్పిడి నైపుణ్యాలు ఇంటర్వ్యూ నైపుణ్యాలు సమస్య పరిష్కార సామర్థ్యం బృందంగా పనిచేసే నైపుణ్యం నాయకత్వం లక్షణాలను పెంపొందించేందుకు కళాశాల ప్రత్యేక దృష్టి సారిస్తుందని అన్నారు 125 మంది కీపైగా విద్యార్థులు ప్లేస్ మెంట్ డ్రైవ్ కు హాజరై 51 మంది ఎంపిక కావడం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు ఎంపికైన విద్యార్థులు తమ ఉద్యోగ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు భవిష్యత్తులో కూడా విద్యార్థులకు మరిన్ని మంచి సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా శిక్షణ మరియు నియామకాల విభాగంలో కలిసి కృషి చేస్తామని తెలిపారు. కళాశాల పరిపాలన అధికారి శ్రీ బి నరేందర్ గారు మాట్లాడుతూ విద్యార్థులు ప్లేస్మెంట్ అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ కెరీర్ కు మంచి దిశను ఏర్పరుచుకోవాలని అన్నారు. కళాశాల శిక్షణ మరియు నియామకాల అధికారి శ్రీ సునీల్ గారు మాట్లాడుతూ. విద్యార్థులకు అవసరమైన శిక్షణ అందిస్తూ వివిధ కంపెనీల ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు 51 మంది విద్యార్థులు ఎంపిక కావడం సంతోషకరమని అన్నారు. తెలంగాణ అకాడమీ పర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ టీఏఎస్ కె ప్రతినిధి శ్రీ రఘు తేజ గారు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించేందుకు టీఏఎస్ కే ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్లస్ మెయిన్ హెచ్ ఆర్ సొల్యూషన్ సంస్థ మానవ వనరుల విభాగం ప్రతినిధులు శ్రీమతి సాయి లక్ష్మి గారు శ్రీ కె సతీష్ రెడ్డి గారు విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ శ్రీ అల్జాపూర్ శ్రీనివాస్ గారు ఫోన్ ద్వారా సందేశం అందిస్తూ ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు విద్యార్థులు తమ ప్రతిభను మరింతగా పెంపొందించుకొని ఉన్నతమైన కెరీర్ను నిర్మించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కరస్పాండెంట్ శ్రీ అల్జాపూర్ దేవేందర్ రెడ్డి గారు ప్రిన్సిపల్ డా. కె శ్రీనివాస్ గారు పరిపాలన అధికారి శ్రీ బి నరేందర్ గారు శిక్షణ మరియు నియామకాల అధికారి శ్రీ సునీల్ గారు మెకానికల్ విభాగాధిపతి శ్రీ వేద ప్రకాష్ గారు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఫ్యాకల్టీ ఇన్చార్జి శ్రీ రాజుగారు అన్ని విభాగాల విభాగ దీపతులు సోషల్ మీడియా ఇన్చార్జ్ శృతి న్ అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

# పామాయిల్, గంజి, పిండితో కల్తీ నెయ్యి తయారీ..

కాదేదీ కల్తీకి అనర్హం అన్నట్లు కల్తీగాళ్లు రెచ్చిపోతున్నారు. చిన్న పిల్లలు తాగే పాలు, తినే చాక్లెట్ల నుంచి వంటింటి సరుకుల వరకు ప్రతిదీ కల్తీ చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం కల్తీలపై ఉక్కుపాదం మోపుతున్నా.. వారి ఆగడాలు మాత్రం ఆగటం లేదు. తాజాగా.. హైదరాబాద్ శివార్లలో భారీ నకిలీ నెయ్యి తయారీ, సరఫరా ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. పామాయిల్, వనస్పతి, మిల్క్ పౌడర్, గంజి, పిండి, రవ్వతో పాటు హానికరమైన సింథటిక్ రంగులు, ఫ్లేవర్లను ఉపయోగించి నకిలీ నెయ్యిని తయారు చేస్తున్న కేంద్రాలపై హెచ్-ఫాస్ట్ బృందాలు విస్తృతంగా దాడులు నిర్వహించాయి. కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి సహా నగర శివారు ప్రాంతాల్లో జరిగిన ఈ తనిఖీల్లో భారీగా కల్తీ నెయ్యి , ముడిసరుకును పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని 39 నెయ్యి తయారీ కేంద్రాలు, 91 రిటైల్ ఔట్‌లెట్లపై దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో సుమారు 25.5 టన్నుల నకిలీ నెయ్యి, 10 టన్నుల ముడిసరుకును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించిన వివరాలను హైదరాబాద్ సీపీ సజ్జనార్ మంగళవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో మీడియాకు వెల్లడించారు. గుజరాత్, తమిళనాడుకు చెందిన కొందరు వ్యాపారులు హైదరాబాద్‌లో మకాం ఏర్పాటు చేసుకొని కల్తీ నెయ్యి, పామాయిల్, ఫుడ్ కలర్స్ వంటి ఉత్పత్తులను హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. బేగంబజార్, మలక్‌పేట గంజ్, సికింద్రాబాద్ తదితర మార్కెట్లతో పాటు ఇతర రాష్ట్రాలకు కూడా ఆయా కల్తీ సరుకును సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ వ్యాపార నెట్‌వర్క్‌లోని కొందరు కలిసి నకిలీ నెయ్యి తయారీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నకిలీ నెయ్యి తయారీ కోసం ఇతర రాష్ట్రాల నుంచి నాసిరకం పాల మీగడను హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో పామాయిల్, వనస్పతి, మిల్క్ పౌడర్ కలిపి నెయ్యి మాదిరి పదార్థాన్ని తయారు చేస్తున్నారన్నారు. నెయ్యికి చిక్కదనం తీసుకురావడానికి గంజి, పిండి, రవ్వ వంటి పదార్థాలను ఉపయోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సహజమైన రంగు, వాసన వచ్చేలా చేసేందుకు వివిధ రసాయనాలు, ఫ్లేవర్లను కలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఇలా తయారు చేసిన ఉత్పత్తులను ప్యాక్ చేసి మార్కెట్‌లోకి పంపుతున్నట్లు పోలీసులు తెలిపారు. హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, స్వీట్ షాపులు, ఆయుర్వేద దుకాణాలకు కూడా వీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పూజల కోసం ఉపయోగించే నెయ్యి పేరుతో ప్రత్యేక బాటిళ్లలో ప్యాక్ చేసి విక్రయిస్తున్నట్లు హెచ్ ఫాస్ట్ అధికారులు వెల్లడించారు. హోటళ్లు, స్వీట్ షాపులకు కల్తీ నెయ్యి సరఫరా చేయడం వల్ల ప్రజారోగ్యంపై ఎలాంటి ప్రభావాలు ఉంటాయని మీరు భావిస్తున్నారు? మీ అభిప్రాయాన్ని కామెంట్ బాక్స్‌లో తెలియజేయండి.


## కల్వకుంట్ల కవితతో తమిళనాడు సీఎం విజయ్ జ్యోతిష్యుడు రాధన్ భేటీ..

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత , తమిళనాడు సీఎం జ్యోతిష్యుడు రాధన్ పండిట్ వెట్రివెల్ భేటీ ఆసక్తికరంగా మారింది. రాధన్ హైదరాబాద్‌లో కవిత ఇంటికి వెళ్లి కలిశారు.. ఆయన్ను కవిత, తన కుమారుడితో కలిసి సత్కరించారు. ప్రస్తుతం ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. రాధన్ చెన్నై నుంచి హైదరాబాద్ వచ్చి మరీ కవితను కలవడంపై చర్చనీయాంశమైంది. కవిత ఆయన్ను పిలపించారా.. ఆయనే ఇక్కడికి వచ్చారా అన్నది తెలియాల్సి ఉంది. కవిత తన రాజకీయ భవిష్యత్ గురించి ఏదైనా ఆరా తీశారా అనే చర్చ మొదలైంది. చాలామంది రాజకీయ నేతలు పండితులు, జ్యోతిష్యుల్ని నమ్ముతుంటారు.. వారు నిర్ణయించిన ముహూర్తాల్లోనే పార్టీ కార్యాలయాలు ప్రారంభించడం, రాజకీయపరమైన నిర్ణయాలు తీసుకోవడం, ఎన్నికల సమయంలో నామినేషన్లు వేయడం, ప్రత్యేక పూజలు చేయించడం వంటి వాటి కోసం జ్యోతిష్యుల్ని సంప్రదిస్తుంటారు. కవిత కూడా తమిళనాడు సీఎం విజయ్ జ్యోతిష్యుడ్ని సలహాల కోసం సంప్రదించారా? అనే చర్చ జరుగుతోంది. రాధన్ తమిళనాడులో విజయ్ ముఖ్యమంత్రి అవుతారని ముందు నుంచి చెబుతున్నారు.. ఆయన చెప్పినట్లుగానే జరిగింది. తమిళనాడు ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ సమయంలో దాదాపు అన్ని సర్వే సంస్థలు టీవీకే అధికారంలోకి వచ్చే అవకాశం లేదని చెప్పగా.. తాము ఎగ్జిట్ పోల్స్ పట్టించుకోమని.. టీవీకే పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని.. విజయ్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని చెప్పారు.

# సింగరేణి లాభాల తగ్గుదలపై స్పష్టత

**- రూ.6,393 కోట్ల నుంచి రూ.1,750 కోట్లకు తగ్గడంపై వివరణ ఇవ్వాలి**

**విప్లవ కార్మిక సంఘాల డిమాండ్**




బెల్లంపల్లి, ఆగస్టు 19 : సింగరేణి కాలరీస్ సంస్థ లాభాలు భారీగా తగ్గడంపై యాజమాన్యం, ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని విప్లవ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. 12వ వేతన ఒప్పందంతోపాటు సింగరేణి ఆర్థిక పరిస్థితిపై మాట్లాడుతూ , 2024--25 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి రూ.6,393 కోట్ల లాభాలు ఆర్జించినట్లు ప్రకటించిందని నాయకులు తెలిపారు. సంస్థ అభివృద్ధి, భవిష్యత్తు పెట్టుబడుల కోసం రూ.4,034 కోట్లు కేటాయించిన తర్వాత మిగిలిన రూ.2,360 కోట్లలో 34 శాతం చొప్పున కార్మికులకు రూ.819 కోట్ల లాభాల వాటా ప్రకటించారని పేర్కొన్నారు. అయితే 2025--26 ఆర్థిక సంవత్సరంలో లాభాలు సుమారు రూ.1,750 కోట్లకు తగ్గినట్లు వార్తలు రావడంతో కార్మికుల్లో అనేక సందేహాలు నెలకొన్నాయని తెలిపారు. బొగ్గు ఉత్పత్తి, రవాణా, అమ్మకాలు, ఉత్పత్తి వ్యయాలు, వేతనాలు, విద్యుత్ రంగ పరిస్థితులు, భవిష్యత్తు ప్రాజెక్టులకు కేటాయింపులు తదితర అంశాలు సంస్థ లాభాలపై ప్రభావం చూపుతాయని నాయకులు పేర్కొన్నారు. రూ.6,393 కోట్ల నుంచి రూ.1,750 కోట్లకు లాభాలు ఎందుకు తగ్గాయో పూర్తి ఆడిట్ చేసిన ఆర్థిక నివేదికల ఆధారంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. 2024--25లో సింగరేణి 6.901 కోట్ల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసిన నేపథ్యంలో 2025--26లో బొగ్గు ఉత్పత్తి, రవాణా, అమ్మకాల ఆదాయం, వ్యయాల్లో వచ్చిన మార్పులను కార్మిక వర్గానికి తెలియజేయాలని కోరారు. రూ.6,393 కోట్ల లాభాల్లో ఏయే ఖర్చులు, కేటాయింపులు మినహాయించారో, రూ.1,750 కోట్ల లాభం ఎలా లెక్కించారో స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. సంస్థ అభివృద్ధి, భవిష్యత్తు ప్రాజెక్టులకు కేటాయించిన నిధులు ఎంతనేది, లాభాల వాటాను ఏ ప్రాతిపదికన నిర్ణయిస్తున్నారో తెలియజేయాలని కోరారు. పూర్తి ఆడిట్ చేసిన ఆర్థిక లెక్కలను కార్మికులు, కార్మిక సంఘాలకు అందుబాటులో ఉంచాలని సింగరేణి యాజమాన్యాన్ని, ప్రభుత్వాన్ని విప్లవ కార్మిక సంఘాల నాయకులు ఎం. పోచమల్లు, అంబాల మహేందర్ డిమాండ్ చేశారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం...
ప్రజాగళం
తెలుగు దినపత్రిక
గురువారం
20-08-2026

## వ్యక్తిత్వ వికాసం మరియు నైపుణ్యాభివృద్ధి అవగాహనా కార్యక్రమం



హుస్నాబాద్ ఆగస్ట్ 19,ప్రజాగళం: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లోని స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యార్థులకు బుధవారం రోజున విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, ఉపాధి అవకాశాల సాధన మరియు వృత్తిపరమైన నైపుణ్యాల పెంపుదల లక్ష్యంగా వ్యక్తిత్వ వికాసం మరియు నైపుణ్యాభివృద్ధి అంశంపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ కె. పురుషోత్తం ముఖ్య వక్తగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా జీవితంతో పాటు వృత్తి జీవితంలోనూ విజయవంతంగా రాణించడానికి అవసరమైన వ్యక్తిత్వ లక్షణాలు, నైపుణ్యాలు మరియు సానుకూల దృక్పథం గురించి ఆయన విపులంగా వివరించారు. వ్యక్తిత్వ వికాసం అనేది కేవలం బాహ్య ప్రవర్తనకు మాత్రమే పరిమితం కాదని, అది వ్యక్తి ఆలోచనా విధానం, మాట్లాడే తీరు, ప్రవర్తన, విలువలు మరియు భావోద్వేగాలను సమర్థవంతంగా నిర్వహించే సామర్థ్యానికి సంబంధించినదని పేర్కొన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగదాతలు విద్యార్హతలతో పాటు ఆత్మవిశ్వాసం, సమర్థవంతమైన కమ్యూనికేషన్, నాయకత్వ లక్షణాలు మరియు బృందంతో కలిసి పనిచేసే నైపుణ్యాలను కూడా ప్రాధాన్యంగా పరిగణిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు కళాశాలలో చేరిన తొలి రోజు నుంచే కొత్త విషయాలను నేర్చుకునే అలవాటును పెంపొందించుకోవాలని, ముఖ్యంగా ఎన్పిటీఈఎల్ వంటి జాతీయ స్థాయి ఆన్‌లైన్ విద్యా వేదికలను ఉపయోగించి తమ జ్ఞానాన్ని విస్తరించుకోవాలని ప్రోత్సహించారు. ఈ అవగాహన కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా, ప్రేరణాత్మకంగా, మార్గదర్శకత్వం విద్యార్థుల్లో నిరంతర అభ్యాసం, నైపుణ్యాభివృద్ధి, ఆత్మవిశ్వాసం మరియు ఉత్తమ వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలనే స్ఫూర్తిని నింపిందన్నారు.

# అసైన్డ్ భూమిలో మసీదు నిర్మాణమా.?



చేవెళ్ళ, ఆగస్ట్ 19,ప్రజాగళం: చేవెళ్ళ మండల పరిధి కుమ్మెర గ్రామపంచాయతీలో అసైన్డ్ భూమిలో అనుమతులు లేకుండా మసీదు నిర్మాణానికి పునాదులు వేస్తున్నారని బజరంగ్‌దళ్ విభాగ్ కన్వీనర్ గూడెం రమేష్ తీవ్రంగా ఆరోపించారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణం జరుగుతున్నా అధికారులు నిద్రపోతున్నారా? అంటూ ఆయన మండిపడ్డారు. అక్రమ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన కుమ్మెరలోని అక్రమ నిర్మాణాన్ని స్వయంగా పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులు తమ బాధ్యతను విస్మరిస్తున్నారని ఆరోపించారు. గ్రామస్థులు నిర్మాణంపై అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. అసైన్డ్ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేపడుతుంటే రెవెన్యూ అధికారులు, గ్రామ కార్యదర్శి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. శ్రీ వీర హనుమాన్ దేవాలయానికి సమీపంలో నిర్మాణం చేపడుతున్నారని, నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని గ్రామ కార్యదర్శి కరుణాకర్ కూడా తెలిపారని రమేష్ పేర్కొన్నారు. అయినా నిర్మాణ పనులు కొనసాగడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. వెంటనే పునాది పనులను నిలిపివేసి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణానికి పూనుకున్న వారిపై పోలీసు శాఖ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని, లేదంటే విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని రమేష్ హెచ్చరించారు. అవసరమైతే నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కార్యకర్తలు, హిందూ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ధర్మప్రచార్ రాఘవేంద్రచారి, బజరంగ్ దళ్ కార్యకర్తలు మహేంద్ర, వడ్ల అక్షయ్, కుమ్మెర గ్రామ మాజీ సర్పంచ్ భానుతేజ, చెన్నోల శ్రీనివాస్, కావలి లక్ష్మీనారాయణ, కావలి కుమార్, బోనగిరి దర్శన్, చంద్రశేఖర్‌రెడ్డి, చాకలి శ్రీకాంత్, కావలి వెంకటేశం, బోధే విష్ణువర్ధన్‌రెడ్డి, బాధే శ్రీకాంత్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# షెడ్యూల్డ్ ప్రాంతంలో 75% రిజర్వేషన్ ఇవ్వాలి

### -కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో జీఓ 109 ప్రకారం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్

### -గాదిగూడలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో సంపూర్ణ బంద్




గాదిగూడ, ఆగస్ట్ 19,ప్రజాగళం: :పోలీస్ కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్‌లో జీఓ నంబర్ 109 ప్రకారం ఏజెన్సీ ప్రాంత అభ్యర్థులకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం గాదిగూడలో సంపూర్ణ బంద్ నిర్వహించారు. రాష్ట్ర ఏజెన్సీ బంద్‌కు మద్దతుగా వ్యాపార, వాణిజ్య సంస్థలను స్వచ్ఛందంగా మూసివేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందోర్ సంతోష్ మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో విద్య, ఉద్యోగ నియామకాల్లో స్థానిక ఆదివాసీ అభ్యర్థులకు ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పోలీస్ కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో షెడ్యూల్డ్ ప్రాంత అభ్యర్థులకు 75 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాల్లో న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని, జీఓ నంబర్ 3ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి ఆదివాసీల హక్కులు, భూములకు రక్షణ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివాసీ ప్రాంతాల్లో అమలులో ఉన్న ప్రత్యేక నిబంధనలను సమర్థంగా అమలు చేయకుండా నియామకాలు చేపడితే స్థానిక యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుందని నాయకులు పేర్కొన్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు మాడావి చంద్రహరి, ఆదివాసీ విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు మారపు గంగారాం, టీజీవీ మండల అధ్యక్షుడు కుంరం భీంరావు, సర్పంచ్ తనాజీ అమృతరావు, జాకు సంతోష్, జంగు, విజయ్, లింగు దేవరావు తదితర యువ నాయకులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి వేళ.. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులకు పిలుపు:

### ఎల్-నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన



నంగునూరు ఆగస్ట్ 19,ప్రజాగళం : వాతావరణ మార్పులు, ఎల్–నినో పరిస్థితుల ప్రభావంతో సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లోనూ, వేసవిలోనూ నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో నంగునూరు మండల రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి సంరక్షణ వైపు ప్రోత్సహించేందుకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఆగస్టు 20న ఉదయం 10 గంటలకు నర్మెట రైతు వేదికలో ఈ సదస్సు జరుగుతుందని మండల ప్రత్యేక అధికారి శివరంజని తెలిపారు. వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖలు, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, ఉపాధి హామీ శాఖల అధికారులు పాల్గొని రైతులకు సూచనలు అందించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేయనున్నారు. వరి సాగుకు అధికంగా నీరు అవసరమయ్యే పరిస్థితుల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని అధికారులు వివరించనున్నారు. ఆయిల్‌పామ్, కందులు, మినుములు, సజ్జ, రాగి, ఆముదం, పొద్దుతిరుగుడు, వేరుశనగతో పాటు కూరగాయల సాగు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించనున్నారు.

ప్రతి పొలంలో ఫామ్ పాండ్లు నిర్మించుకోవడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకుని అవసరమైన సమయంలో పంటలకు వినియోగించుకోవచ్చని అధికారులు సూచించనున్నారు. భూగర్భ జలాల పరిరక్షణ, నీటి పొదుపు, సమర్థవంతమైన నీటి యాజమాన్య పద్ధతులపై కూడా సదస్సులో చర్చించనున్నారు.

ఒక ఎకరం వరి సాగుకు వినియోగించే నీటితో పరిస్థితులకు అనుగుణంగా 3 నుంచి 9 ఎకరాల వరకు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసే అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. తద్వారా అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు అధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేసి ఆదాయం పెంచుకునే మార్గాలను వివరించనున్నారు. “తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేద్దాం--అధిక ఆదాయాన్ని పొందుదాం” అనే నినాదంతో రైతులను చైతన్యపరచనున్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, సర్పంచులు, రైతులు సదస్సుకు హాజరై మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, నీటి సంరక్షణపై అవగాహన పొందాలని మండల ప్రత్యేక అధికారి శివరంజని కోరారు. “నీటి వినియోగాన్ని తగ్గిద్దాం... వరి సాగును పరిమితం చేద్దాం... ఆరుతడి పంటలను ప్రోత్సహిద్దాం!” అనే సందేశంతో రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించనున్నారు.



# ఫోటో జార్నలిస్టుల సేవలు అమోఘం.

### ప్రపంచ ఫోటో గ్రఫీ డే" లో

### అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ.

నిజామాబాద్,ఆగస్ట్ 19,ప్రజాగళం: ఒక ఫోటో వేల మాటలు చెప్పగలదని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని ప్రెస్ క్లబ్ లో బుధవారం ప్రెస్ ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటో గ్రఫీ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఫోటోగ్రాఫర్ అంటే కేవలం కెమెరా ఆపరేటర్ కాదని, సమాజంలో జరిగే మంచి, చెడు, చారిత్రక సంఘటనలను భవిష్యత్ తరాలకు భద్రపరిచే వారన్నారు. చరిత్రలోని ఎన్నో ముఖ్య ఘట్టాలు ఫోటోల ద్వారానే మనకు గుర్తుండిపోతాయన్నారు. ప్రకృతి విపత్తులు, సామాజిక కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, విజయాలు, ప్రతి అంశాన్ని ప్రజల ముందుకు తీసుకురావడంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర కీలకం అని చెప్పారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం కృషి...

జర్నలిస్టుల చిరకాల వాంఛ ఇళ్ళ స్థలాల కోసం తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. నిజామాబాద్ జర్నలిస్టుల్లో ఐక్యత ఉంటుందని, ఇదే ధోరణితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రెస్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రతన్, ప్రధాన కార్యదర్శి భానూతేజ, గౌరవ అధ్యక్షుడు గోవిందరాజు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పంచరెడ్డి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి సుభాష్, కోశాధికారి రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజు, సీనియర్ ఫోటో గ్రాఫర్ బాలరాజు, వీడియో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు నాగేష్, సీనియర్ ఫోటో గ్రాఫర్లు, జర్నలిస్టులు పాల్గొన్నారు.



## ఆర్మూర్ లో యశోద హాస్పిటల్ రోబోటిక్ ఆర్థో ప్రత్యేక కన్సల్టెన్సీ.: డాక్టర్ సుఖేష్ రావు.




ఆర్మూర్ ఆగస్టు 18 (ప్రజగళం) నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో యశోద ఆసుపత్రి రోబోటిక్ ఆర్థోపెడిక్ వైద్యాన్ని ప్రత్యేక కన్సల్టెన్సీ అందుబాటులోకి తెచ్చామని ప్రముఖ యశోద ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ సుఖేష్ రావు తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం లో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్థోపెడిక్ వైద్యాన్ని అందించేందుకు యశోద ఆసుపత్రి ముందుకు వచ్చిందన్నారు. ప్రతి నెల మూడో బుధవారం పట్టణంలోని అపర్ణ హాస్పిటల్లో ఆర్థోపెడిక్ వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. ఆర్థోపెడిక్ సంబంధించి మోకాలు చెప్పే మార్పిడి కాలు చేతులు విరిగిన వాటికి సంబంధించి శాస్త్ర చికిత్స పరీక్షలు నిర్వహించబడతాయన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఆర్థోపెడిక్ వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థోపెడిక్ సంబంధించి మోకాలు చిప్పే మార్పిడి కాలు చేతులు విరిగిన వాటికి సంబంధించి శాస్త్ర చికిత్స పరీక్షలు నిర్వహించబడతాయన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఆర్థోపెడిక్ వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# ఏవెన్యూ ప్లాంటేషన్ ప్రారంభించిన సర్పంచ్

వాజేడు,ఆ :గుమ్మడిదొడ్డి గ్రామపంచాయతీలో ఏవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని బుధవారం సర్పంచి బోదెబోయిన భరత్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ... రోడ్లు, రహదారులు, నడకమార్గంలో చెట్లను నాటడంతో పరిసరాల అందాన్ని మెరుగుపరుస్తుందన్నారు. వాయు కాలుష్యాన్ని తగ్గిస్తుందని, అదేవిధంగా నేల కోతను నివారిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు తదితరులు పాల్గొన్నారు

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక



# తలారి తిరుపతి మరణం పోలీస్ శాఖకు తీరని లోటు.

కుటుంబసభ్యులను ఓదార్చిన పోలీస్ కమిషనర్.

అంత్యక్రియలకు హాజరై, నివాళులర్పించిన సీపీ సాయి చైతన్య.



నిజామాబాద్ క్రైమ్ ఆగస్టు 19 (ప్రజా గళం ) పోలీస్ హెడ్ కానిస్టేబుల్ తలారి తిరుపతి గుండెపోటుతో మృతి మృతి చెందడం పోలీస్ శాఖకు తీరని లోటని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. తలారి తిరుపతి మృతి పోలీసు శాఖను దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రెంజల్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న తలారి తిరుపతి , హెడ్ కానిస్టేబుల్ : 1549 ( ప్రస్తుతం ఆర్మూర్ ఎ.సి.పి కార్యాలయంలో విధులు ) నిర్వహిస్తున్నారు. తలారి తిరుపతి మంగళవారం ఆకస్మికంగా గుండెపోటుకు గురై మృతి చెందారు. ఆయన మృతి పట్ల పోలీస్ శాఖలో విషాదం నింపింది. తలారి తిరుపతి అంత్యక్రియలు బుధవారం ఆర్మూర్ లో నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన తలారి తిరుపతి పార్థివదేహానికి పుష్పగుచ్ఛం సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి , వారి బాధను పంచుకుని ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఓదార్చారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. తలారి తిరుపతి మృతి పోలీస్ శాఖకు తీరని లోటని , ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పోలీస్ కమిషనర్ ఆకాంక్షించారు. అంత్యక్రియలలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ ఎస్హెచ్ఓ సత్యనారాయణ, బోధన్ రూరల్ సిఐ విజయబాబు, రెంజల్ ఎస్సై ఎం గంగాధర్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు షకిల్ పాషా పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అటవీ ప్రాంత సంరక్షణ కోసం సమన్వయంతో కృషి చేయాలి.

## జిల్లా కమిటీ సమావేశంలో కలెక్టర్ భవేష్ మిశ్రా.



నిజామాబాద్, ఆగస్టు 19 ( ప్రజాగళం ప్రతినిధి ) జిల్లాలో అటవీ ప్రాంత సంరక్షణ కోసం వివిధ శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో అటవీ ప్రాంత విస్తీర్ణం పెంపొందించేందుకు చేపట్టాల్సిన చర్యలు, అటవీ భూముల ఆక్రమణల నిరోధం, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ శాఖ అధికారులు, సిబ్బందిపై దాడులకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు చేపట్టడం, వనమహోత్సవం కింద విరివిగా మొక్కలు నాటడం, జల సంరక్షణ కార్యక్రమాల అమలు, వాల్టా చట్టం అమలు, అనువైన అటవీ ప్రదేశాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడం తదితర అంశాలపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో అటవీ శాఖపరంగా నెలకొని ఉన్న పరిస్థితుల గురించి జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ పాటిల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. జిల్లాలో 20 శాతానికి పైగా 86947.11 హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉందని తెలిపారు. అయితే, సిరికొండ, కమ్మర్పల్లి, కాల్పోల్ తండా, డీ.బీ.తండా, చందూర్ తదితర ప్రాంతాలలో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, కబ్జాదారులపై చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టేందుకు పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల తోడ్పాటు అవసరం ఉందని అన్నారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ, అటవీ ప్రాంత సంరక్షణకు ఆయా శాఖలు ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ కు తప్పకుండా తగిన సహకారం అందించేలా చూస్తామన్నారు. అటవీ భూములను కబ్జా చేస్తే కఠిన చట్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుండి ఆయా గ్రామాలలో విరివిగా సమావేశాలు నిర్వహిస్తూ, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అధికారులకు సూచించారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం అన్ని చర్యలు చేపట్టాలని, చిరుతలు, ఇతర వన్యప్రాణులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్న చోట వాహనాల వేగాన్ని నియంత్రించేలా తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు.

అటవీ సంపద పరిరక్షణ కోసం జిల్లాలో అవసరమైన సరిహద్దు ప్రదేశాలలో చెక్ పోస్టుల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. జల సంరక్షణ, భూగర్భ జల వనరుల పెంపు కోసం అటవీ ప్రాంతాలలో చెక్ డ్యాంలను నాణ్యతతో నిర్మించాలని, వన మహోత్సవంలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలని అన్నారు. ఆర్మూర్ నగర వాటిక, నిజామాబాద్ లోని ఖిల్లా, నందిపేట లోని ఎస్సారెస్పి బ్యాక్ వాటర్ ఏరియా, అంకాపూర్ లోని మోడల్ స్కూల్ తదితర చోట్ల అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసే ప్రతిపాదనలకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి తోడ్పాటును అందిస్తామని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయకుమారి, ట్రైనీ ఆర్డీఓ సందీప్, ఏ.సీ.పీలు ప్రకాశ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, అటవీ, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సిర్పూర్ శివాలయంలో అన్నదాన కార్యక్రమం



డోంగ్లీ, ఆగస్టు 19 (ప్రజా గళం ) డోంగ్లీ మండలం సిర్పూర్ గ్రామంలో ప్రసిద్ధమైన శివాలయం లో భక్తులకు మాజీ ఎంపీ బి బి పాటిల్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. బుధవారం రోజున శ్రావణ మాసం సందర్భంగా శివాలయానికి ప్రతి రోజు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దైవ దర్శనం చేస్కోవడం జరుగుతుంది. భక్తులకు గ్రామ సర్పంచ్ గజానంద్ పటేల్ దగ్గరగా ఉండి భక్తులకు అన్నదాన కార్యక్రమం లో పాల్గొన్నారు. స్వయంగా సర్పంచ్ గజానంద్ పటేల్ అన్నదాన కార్యక్రమం పూర్తయ్యే వరకు దగ్గరగా ఉండి అన్నం వడ్డించడం జరిగింది. శ్రావణ మాసం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో ఉపవాసలు చేపట్టి దైవ దర్శనం పొందటం జరుగుతుందని తెలిపారు.

# అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట.

## అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలి.

## పిఎసి సమావేశంలో జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క



నిజామాబాద్ ఆగస్టు 19 ( ప్రజాగళం ప్రతినిధి ) తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పిఎసి సమావేశం బుధవారం జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో గల ఎంకే గార్డెన్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్చార్జ్ మంత్రి సీతక్క తో పాటు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నాయకులు ముందుండాలని ఆమె అన్నారు.టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బూత్ స్థాయి కమిటీలను మరింత క్రియాశీలం చేసి ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని అన్నారు. పార్టీ కార్యక్రమాలను క్రమబద్ధంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముకని



ఆయన అన్నారు. పార్టీని గ్రామస్థాయి నుండి కొరకు జిల్లా స్థాయి వరకు పటిష్టంగా నిర్మాణం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి పోలింగ్ బూత్ లో పార్టీ సశీస్థ గత నిర్మాణాన్ని బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. పార్టీకి సంబంధించిన ప్రతి ఒక్కరూ ఎన్నికల సమయంలోనే కాకుండా నిరంతరం ప్రజల్లో ఉంటూ వారికి సేవలు అందించాలన్నారు.ఈ సమావేశంలో నిజామాబాద్ మేయర్ ఉమారాణి, ఎమ్మెల్యే మదన్ మోహన్, సునీల్ రెడ్డి, వినయ్ రెడ్డి, యూసుఫ్ అలీ, కాసుల బాలరాజ్, అరికెలనర్సారెడ్డి , ఆకుల లలిత, కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్, కార్పొరేషన్ చైర్మన్లు మోహన్ రెడ్డి, ఈరవత్రి అనిల్, కేశ వేణు, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అజీమ్ లాల పుట్టిన వేడుకలు ఘనంగా నిర్వహణ



మద్నూర్, ఆగస్టు 19 (ప్రజా గళం ) : కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు అజీమ్ లాల పుట్టిన వేడుకలు గ్రామంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. షేకపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లోకండె గంగాధర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పుట్టిన వేడుకలు నిర్వహించడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగాధర్ ( సూసైటీ మాజీ చైర్మన్ తడుగుర్ ) అబ్బు ( సుల్తాన్ పేట్ ), గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ చిన్నపిల్లల సమక్షంలో శాలువా, పూలమాల వేసి వేడుకలు నిర్వహించడం జరిగింది. అజీమ్ కేక్ చిన్న పిల్లల్లకు తినిపించడం జరిగింది. అజీమ్ లాలకు జిల్లా లోని ఆయా నియోజక వర్గాల కామారెడ్డి జిల్లా నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు, క్రియ శిలా కార్యకర్తలు, బందు మిత్రులు చరవాణి, సోషల్ మీడియా, ట్విటర్ ద్వారా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ జిల్లా అధ్యక్షుడు అజీమ్ లాల కు పుట్టిన వేడుకలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రైతులు సమీకృత వ్యవసాయంపై దృష్టి సాధించాలి

ముధోల్:ఆగస్టు 19 (ప్రజా గళం ) : రైతులు సమీకృత వ్యవసాయంపై దృష్టి సారించాలని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ కే. సుధాకర్ అన్నారు. బుధవారం మండలంలో తరోడా గ్రామ శివారులో రైతు సాగుచేస్తున్న సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని ఆయన పరిశీలించారు. రైతు సాగు చేస్తున్న చేపల పెంపకాన్ని స్వయంగా చూసి ఎదుగుదల, ఆహారాన్ని అందిస్తున్న విషయాలను తెలుసుకున్నారు. వ్యవసాయ క్షేత్రంలో పంటల సాగుతో పాటు వివిధ అనుబంధ కార్యకలాపాలను సమన్వయం చేసుకుంటూ రైతు చేపడుతున్న విధానాన్ని ఆయన పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీకృత వ్యవసాయ విధానం ద్వారా రైతులు తమ భూమిని సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు వ్యవసాయంపై ఆధారపడిన ఆదాయ వనరులను పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. అంతకుముందు గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించి హరితవనోత్సవంలో భాగంగా మొక్కను నాటా రు. ఈయన వెంట డిఆర్డివో విజయలక్ష్మి, ఎంపీడీవో లవ కుమార్, డిఎల్పిఓ లక్ష్మణ్, సర్పంచ్ అరీ పొద్దీన్, పంచాయతీ కార్యదర్శి అమిత, ఏపీవో శిరీష,ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ లుతోపాటు తదితరులున్నారు.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com